క్లుప్తంగా

కాంగ్రెస్‌లో పలు కుటుంబాలు చేరిక

రఘునాథపాలెం: మండలంలోని కోయచలక గ్రామంలో ఎండపల్లి సత్యం, చెరుకూరి పూర్ణ చంద్రరావు, ఎంపీటీసీ బలుసుపాటి సుజాత ఆధ్వర్యాన ఎస్సీ కాలనీ నుంచి పలు కుటుంబాలు మంగళవారం రాత్రి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకుపార్టీ కండవా కప్పి నాయకులు స్వాగతించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాదంశెట్టి హనుమంతరావు, అమరం అప్పారావు, చెరుకూరి సీతారాములు, నాగేశ్వరరావు, చెరుకూరి ముత్తయ్య, మాదంశెట్టి సీతారాములు, బలుసుపాటి శేషయ్య, మేడి అయోధ్య తదితరులు పాల్గొన్నారు.

గోపీనాథ్‌పై కేసు ఎత్తి వేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మంకు చెందిన కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్‌పై ఉపా, దేశద్రోహం కేసు వెంటనే ఎత్తి వేయాలని బీఆర్ అంబేడ్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మంలోని గోపీనాథ్ నివాసంలో లింగాల కలిసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉద్దేశపూర్వకంగానే కుట్ర పన్ని గోపీనాథ్‌ను ఈ కేసులో ఇరికించారని, ఇది చాలా దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్ర గంగాధర్, కొప్పుల రామారావు, కరాటే వేణు తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన సంతాపం

ఖమ్మం లీగల్: ఖమ్మం పట్టణానికి చెందిన మహిళా న్యాయవాది కె.స్వప్న ఆకస్మిక మృతికి మంగళవారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు అధ్యక్షతన సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులు వెలిగించి ఆమెకు శ్రద్ధాంజలి ఘటించారు. కాగా,ఆమె మృతికి సంతాప సూచికంగా న్యాయవాదులు ఒక రోజు విధులను బహిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు దిరిశాల కృష్ణారావు, మన్నేపల్లి బసవయ్య, బార్ కౌన్సిల్ సభ్యులు కొల్లి సత్యనారాయణ సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఘనంగా మహా పడిపూజ

కామేపల్లి: మండలంలోని గోవింద్రాల గ్రామంలో అయ్యప్ప మాలధారుల మహా పడిపూజ సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గురుస్వామి సంజీవ్ నంభూద్రి ఆధ్వర్యాన అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కలశాభిషేకం, అగ్నిగుండం, నగర సంకీర్తనలతో అయ్యప్ప భక్తులు ఆటపాటలతో సందడి చేశారు. మహా పడిపూజతో గ్రామంలో అయ్యప్ప నామస్మరణతో మారుమోగిపోయింది. అనంతరం మాలధారులకు భిక్ష ఏర్పాటు చేశారు.

గుండెపోటుతో సీపీఎం నాయకుడి మృతి

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు కామల్ల సీతారాములు(86) మంగళవారం గుండెపోటుతో మృతిచెందారు. మరణవార్త తెలుసుకున్న పార్టీ మండల నాయకుడు దొండేటి ఆనందరావు, సొసైటీ డైరెక్టర్ చల్లా వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ అంగడి వీరస్వామి, నాయకులు రామనబోయిన రవి, పద్మనాభల సుధాకర్, గ్రామ శాఖ కార్యదర్శి పప్పుల ఉపేందర్, కామల్ల వీరభద్రం, కామల్ల విజయరావు తదితరులు సీతారాములు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సలార్
వినోద	సలార్
సాయిరాం	డుంకీ
ఆదిత్య	సలార్
శ్రీనివాస	సలార్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	26	బచ్చలికూర	3
వంకాయ	66		10
బెండకాయ	60	పాలకూర	3
పచ్చిమిర్చి	46		20
కాకర	80	చుక్కకూర	3
బోడ కాకర	100		20
బీర	66	తోటకూర	3
దొండ	80		10
పొట్లకాయ	36	గోంగూర	2
చిక్కుడు	70		10
గోరుచిక్కుడు	70	మెంతికూర	2
క్యాబేజీ	20		10
క్యాలీఫ్లవర్	36	కొత్తిమీర	1
ఆలుగడ్డ	24		30
చామగడ్డ	56	పుదీన	1
క్యారెట్	54		20
క్యాప్సికం	66	-ఖమ్మం వ్యవసాయం	

కన్ను పడితే ఖతమే..!

అధికారుల అండదండలతో రియల్టర్ల భూదందా

- రూరల్‌లోనే ఎకరాల కొద్దీ ఆక్రమణ
- నామారూపాల్లేని 33 అడుగులున్న సాగర్ కాల్వ
- రూ.30 కోట్ల విలువైన సాగర్ కాల్వ భూములూ హాంఫట్
- ప్రభుత్వ భూమి ఇంచు ఆక్రమించినా సహించేది లేదంటున్న నూతన ప్రభుత్వం
- అక్రమార్కుల గుండెల్లో రైళ్లు







పది అడుగుల వరకు కుంచింకుపోయిన పంట కాల్వ. ఆటోనగర్‌లో ఓ వెంచర్ దారి కోసం పంటకాల్వపై వేసిన సిమెంట్ పైపులు

ఖమ్మంరూరల్: ప్రభుత్వ భూములు ఆక్రమణ చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలి పెట్టేదిలేదని నూతన ప్రభుత్వం హెచ్చరించడంతో భూ ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ప్రధానంగా ఖమ్మం నగరానికి కూతవేటు దూరంలో ఉన్న రూరల్ మండలంలో గత అయిదారేళ్ల కాలంలో కొంతమంది అక్రమార్కులు ప్రభుత్వ భూమితో పాటు ప్రైవేట్ భూములను కాజేసినట్లు అప్పట్లో పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. అయితే అప్పటి ప్రభుత్వం వీరిపట్ల ఎందుకో ఉదాసీనంగా వ్యవహరించడంతో వారి అక్రమాలకు అంతులేకుండా పోయింది. కానీ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రభుత్వ భూముల ఆక్రమణదారులపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించడంతో ఇప్పుడు అక్రమార్కులు ఆందోళన చెందుతున్నారు. ఆక్రమణదారులతో పాటు వీరికి అండగా నిలిచిన సదరు అధికారులను కూడా వదిలిపెట్టబోమని స్వయంగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలపడంతో ఇప్పుడు అక్రమార్కులు బెంబేలెత్తిపోతున్నారు. రూరల్ మండలంలో ఎన్నెస్పీ కాల్వ భూములను ఆక్రమించడం, మున్నేటి పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించడం, బఫర్ జోన్‌లో ప్లాట్లు చేయడం వంటివి గతంలో జరిగాయి. ప్రభుత్వ భూముల ఆక్రమణపై ప్రభుత్వం విచారణ జరిపితే తమ పరిస్థితి ఏంటని అప్పట్లో పని చేసిన రెవెన్యూ అధికారులు తెగ మదనపడుతున్నట్లు సమాచారం.

పంట కాల్వలపై రియల్టర్ల కన్ను..

ఎన్నెస్పీకి చెందిన పిల్ల కాల్వల నుంచి పంట పొలాలకు సాగునీటిని మళ్లించేందుకు గత 30 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం ఏదులాపురం చెరువు నుంచి పెదతండా, గుర్రాలపాడు వరకు పంట భూములకు సాగునీరు ఇచ్చేందుకు 33 అడుగుల కాల్వను తవ్వారు. ఆ కాల్వ నుండే కొంతకాలం క్రితం వరకు సాగునీరు సక్రమంగా వెళ్లేది. ఎప్పుడైతే రియల్ వ్యాపారం మొదలైందో.. అప్పటి నుంచి రియల్టర్ల కన్ను పంట కాల్వలపై పడింది. దీంతో క్రమక్రమంగా పంట కాల్వలను ఆక్రమిస్తూ దర్జాగా కాల్వ ఆక్రమణ భూమిలో ప్లాట్లు చేయడం, భవన నిర్మాణాలు చేపట్టడం యథేచ్ఛగా నడిచింది. దీంతో ఈరూపేనా కొంత భూమి ఆక్రమణకు గురైంది. ప్రభుత్వ భూములను అక్రమార్కులకు కట్టబెట్టడంలో అప్పటి కొందరి రెవెన్యూ అధికారులు,పంచాయతీ అధికారుల పాత్ర కూడా ఉందనే విమర్శలున్నాయి.

అక్రమార్కుల పని పట్టేందుకు అడుగులు..

ఈ ఆక్రమణల వ్యవహారంపై నూతన ప్రభుత్వం విచారణ చేయిస్తే ఇంకా మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ నెలలో కలెక్టరేట్‌లో ఉన్నతాధికారులతో పాలేరు నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశంలో భూ దందా, మట్టి, మైనింగ్, ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించడంతో అక్రమార్కులు హడలిపోతున్నారు. ప్రభుత్వ భూమి సెంటు ఆక్రమించినట్లు తేలినా.. ఉపేక్షించేదిలేదని మంత్రి పొంగులేటి తెలపడంతో ఆ దిశగా సంబంధిత అధికారులు కూడా అక్రమార్కుల పని పట్టేందుకు అడుగులు వేస్తున్నట్లు తెలిసింది.

రియల్టర్లు, అధికారులదే హవా..

ప్రభుత్వ భూముల ఆక్రమణల పర్వంలో అప్పటి అధికార పార్టీ నాయకుల అండదండలతో కొంతమంది రియల్టర్లు రెచ్చిపోయి ఎక్కడ ప్రభుత్వ భూమి కనబడితే అక్కడే వాలిపోయి అధికారులను నయానో భయానో మచ్చిక చేసుకొని తమ పని కానిచ్చేశారు.

- రూరల్ మండలంలోని మంగళగూడెంలో ప్రధానంగా ఎకరాల కొద్దీ ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. ఈ విషయమై గ్రామస్తులు కొందరు అధికారులను కలిసినా.. ప్రయోజనం లేకపోవడంతో ఇప్పటికీ ప్రభుత్వ భూమికి రక్షణ లేకుండాపోయింది.
- గుదిమళ్ల పరిధిలోని మున్నేటి పక్కన కొందరు రియల్టర్లు ప్రభుత్వ భూమిని కొంతవరకు ఆక్రమించుకొని వెంచర్ వేయడం అప్పట్లె పెద్ద దుమారమే లేచింది.
- పెదతండా, ఏదులాపురం, ముత్తగూడెం ఏరియాల్లో కొందరు రియల్టర్లు పంట పొలాలకు వెళ్లే సాగర్ కాల్వను సైతం ఆక్రమించుకొని కాల్వ నామారూపాల్లేకుండా చేశారు. 33 అడుగులు ఉండాల్సిన పంట కాల్వ ఇప్పుడు అసలు కాల్వే లేకుండా చేశారు. పంట కాల్వలు ఆక్రమణలతో చాలా వరకు కుచించుకుపోయాయి.
- ఏదులాపురంలోని ఆటోనగర్‌లో ఓ వెంచర్ నిర్వాహకుడు 33 అడుగుల కాల్వను మొత్తం ఆక్రమించి కాల్వపై రెండు సిమెంట్ పైపులు వేసి తన వెంచర్‌కు దారి ఏర్పర్చుకున్నాడంటే ప్రభుత్వ భూమి ఏవిధంగా ఆక్రమణకు గురైందో ఇట్టే అర్థమవుతోంది. ఫలితంగా పంటపొలాలకు సరిగా సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.రూరల్ మండలంలోని పెదతండా, ఏదులాపురం, గొల్లగూడెం, ముత్తగూడెం, వరంగల్ క్రాస్‌రోడ్ ప్రాంతాల్లో ఈ కాల్వల ఆక్రమణ ఎక్కువగా ఉంది.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీటీ

కామేపల్లి: రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని సివిల్ సప్లయిస్ డీటీ రామచందర్‌రావు అన్నారు. పండితాపురం గ్రామంలో పలువురు రైతులు కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని, దళారులకు విక్రయించడం ద్వారా ధరను తగ్గించి కొనడంతో పాటు తూకాల్లో మోసాలు జరుగుతాయని పేర్కొన్నారు. ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలు పాటించి పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలకు తరలించి విక్రయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ పవన్‌కుమార్, సీఈఓ దొడ్డ ముత్తయ్య పాల్గొన్నారు.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ జమలారెడ్డి

నేలకొండపల్లి: తెలంగాణ ప్రభుత్వం ప్రజల వద్దకు పాలనలో భాగంగా ఏర్పాటు చేయనున్న ప్రజాపాలనను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నేలకొండపల్లి ఎంపీడీఓ కె.జమలారెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేపటి నుంచి జనవరి 6 వరకు మండలంలోని అన్ని పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించేందుకుతహసీల్దార్ అనురాధబాయి, ఎంపీడీఓ జమలారెడ్డి, సీహెచ్.శివ ఆధ్వర్యాన మూడు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతీ రోజు రెండు పంచాయతీల చొప్పున గ్రామసభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మేజర్ పంచాయతీలలో దరఖాస్తులు స్వీకరణ కోసం అవసరమైతే ఎక్కువ కౌంటర్లను ఏర్పాటు చేయాలని ఆదేశాలు అందాయని, గ్రామ సభలపై విస్తృత ప్రచారం చేయనున్నట్లు తెలిపారు.

సుబ్బారావు ఆశయాలను కొనసాగిస్తాం..



మాట్లాడుతున్న పోటు రంగారావు

తిరుమలాయపాలెం: తెలంగాణఉద్యమంలో కాలుకి గజ్జ కట్టి తన ఆటపాటలతో కీలక పాత్ర పోషించిన అరుణోదయ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామ్రేడ్ కుంబజాడ పిచ్చయ్య ఆశయాలను కొనసాగిద్దామని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. మంగళవారం మండలంలోని తెట్టెలపాడులో సుబ్బారావు ప్రథమ వర్ధంతి సభ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రజాపంథా ఖమ్మం జిల్లా కార్యదర్శి గోకనపల్లి వెంకటేశ్వరరావు, తెట్టెలపాడు మాజీ సర్పంచ్ పుసులూరి నరేందర్, ప్రజాపంథా రాష్ట్ర నాయకులు ఆవుల అశోక్, సీ.వై.పుల్లయ్య, జిల్లా నాయకులు పాలేరు డివిజన్ కార్యదర్శి వెంకయ్య, నాగేశ్వరరావు, పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్.శిరోమణి, టి.ఝాన్సీరాణి, మంగతాయి, సరోజిని, హనుమంతరావు, సుబ్బారావు, భారతమ్మ, నవీన్, నరసయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాముడి అక్షింతలు, కలశానికి ప్రత్యేక పూజలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 7వ డివిజన్‌లో అయోధ్య రామ మందిరం నుంచి తీసుకొచ్చిన రాముడి అక్షింతలు, కలశంలను దేవాలయ కమిటీ ఆధ్వర్యాన గ్రామంలో కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ దంపుతల సమక్షంలో ఊరేగించి దేవాలయంలో భక్తుల దర్శనం చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

19న అదృశ్యం.. 26న ప్రత్యక్షం..

నేలకొండపల్లి: మండలంలోని బుద్ధారం గ్రామానికి చెందిన ఓ విద్యార్థి ఈ నెల 19వ తేదీన అదృశ్యమై మంగళవారం ప్రత్యక్షమయ్యాడు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన విద్యార్థి (15) పదో తరగతి చదువుతున్నాడు. వివిధ కారణాలతో ఈ నెల 19న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు పలు చోట్ల వెతికి చివరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు కంటి మీద కునుకు లేకుండా గాలిస్తుండగా.. చివరకు మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యక్షమయ్యాడు. వారం రోజుల తర్వాత ఆ విద్యార్థి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తాను హైదరాబాద్‌లో ఉన్నట్లు సమాచారం అందించగా.. కుటుంబ సభ్యులు వెళ్లి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. నేలకొండపల్లి ఎస్సై బి.సతీష్ కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులతో ఇంటికి పంపించారు.

నేడు సన్నాహక సమావేశం

రఘునాథపాలెం: ప్రజా పాలన కార్యక్రమాన్ని పురస్కరించుకొని మండల స్థాయిలో సన్నాహక సమావేశం బుధవారం ఉదయం 10:30 గంటలకు రఘునాథపాలెంలోని రైతువేదికలో ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, టీం సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు సకాలంలో తప్పక హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు, జిల్లా ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, మండల ప్రత్యేక అధికారి, ఖమ్మం నియోజకవర్గ ప్రత్యేక అధికారి కూడా పాల్గొంటారని అందరూ తప్పక హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య, తెలంగాణ మాదిగ హక్కుల దండోర రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ కోరారు. మంగళవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ చేస్తానని కమిటీల పేరుతో మాదిగలను మోసం చేసిన కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పడానికి ఈ నెల 28న ఏపీలోని గుంటూరు నగరం అంబేడ్కర్ భవన్‌లో జరిగే జాతీయ కార్యవర్గ సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర, ఇటుక రాజు, జున్ను కనక రాజు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలను కలిసిన నాయకులు



ఖమ్మంమయూరిసెంటర్: మంత్రి తుమ్మలకు వినతిపత్రం ఇస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

తుమ్మలను సన్మానించిన కురుమలు..

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును అఖిల భారత యాదవ మహాసభ జిల్లా శాఖ గౌరవాధ్యక్షుడు, డీసీసీబీ డైరెక్టర్, కాంగ్రెస్ నాయకుడు మేకల మల్లిబాబుయాదవ్, బమ్మిడి శ్రీనివాస్, వీర్ల వరప్రసాద్, పుచ్చకాయల వీరభద్రంల ఆధ్వర్యాన మంగళవారం వీడియోస్ కాలనీలోని మంత్రి క్యాంపు ఆఫీస్‌లో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. కురుమల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ఈనేపథ్యాన మల్లిబాబు మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలోని విలీన గ్రామాలకు గొర్రెలకు బదులు పాడి గేదెలను ఇప్పించాలని, గొర్రెల పథకం కోసం డీడీలు తీసిన వారికి నేరుగా నగదును అకౌంట్‌లోకి బదిలీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లెబోయిన భారతీచంద్రం, మాజీ కార్పొరేటర్ చేతుల నాగేశ్వరరావు, మూడుముంతల గంగరాజు, చంద్రకాని వెంకన్న, దుబాకుల శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, భాతుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సాయిద్ అహ్మద్ ఖాస్మీ ఆధ్వర్యాన..

ఖమ్మం మామిళ్లగూడెం: మదర్సా ఇస్లామియా దారుల్ ఉలూం కాల్వొడ్డులో జమీయతే ఉలేమా ఏ హింద్ జిల్లా అధ్యక్షుడు, మదర్సా కరస్పాండెంట్ మౌలానా సాయిద్ అహ్మద్ ఖాస్మీ ఆధ్వర్యాన మంగళవారం సాయంత్రం మంత్రి తుమ్మల నాగేశ్వరావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ముస్లిం మైనార్టీల సమస్యలను ప్రణాళికబద్ధంగా పరిష్కరిస్తానన్నారు. తొలుత ఓ పేపర్ సీనియర్ జర్నలిస్టు హఫీజ్ జవ్వాద్ ఆధ్వర్యాన ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మౌలానా అబ్దుల్ సత్తార్ ఖాస్మీ, హఫీజ్ జమీల్ అహ్మద్, కాంగ్రెస్ నాయకుడు చోటేబాబా, యువజన నాయకుడు ఎండీ అష్రఫ్, కార్పొరేటర్ కమర్తపు మురళి తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ ఆధ్వర్యాన వినతి..

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కేంద్రంగా జిల్లాలో జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యాన రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆజాద్, ఖమ్మం జిల్లా కార్యదర్శి వెంకటేశ్‌లు మాట్లాడుతూ.. జిల్లాకు యూనివర్సిటీ కేటాయించాలని వివిధ రూపాలలో విద్యార్థి, ప్రజా సంఘాలు ఆందోళన చేస్తున్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 146 డిగ్రీ, 26 పీజీ, 10 బీఈడీ, నాలుగు డైట్, ఒక లా కళాశాల ఉండగా.. వీటిలో సుమారు 90 వేలకు పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, యూనివర్సిటీ ఏర్పాటుతో అన్ని కళాశాలపై పర్యవేక్షణ, కార్యనిర్వహణ, అవకతవకలకు అడ్డుకట్ట వేసేందుకు వీలుంటుందని తెలిపారు. జిల్లా విద్యారంగ అభివృద్ధి కోసం ఖమ్మం జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేయాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ ఖమ్మం డివిజన్ కార్యదర్శి లక్ష్మణ్, నాయకులు కరుణ్, శ్రీకాంత్, పృథ్వి, ప్రసాద్, సందీప్, శ్రీను, భరత్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలను కలిసిన ఎన్‌వీబంజర వాసులు..

రఘునాథపాలెం: మండలంలోని ఎన్‌వీబంజర పంచాయతీకి చెందిన సుమారు 50 కుటుంబాలు మంగళవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిశారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకుంటామని మంత్రికి భరోసా ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో జర్పుల చిన్న, జ్యోతి, నాగేశ్వరరావు, బావుసింగ్, వీరన్న, లక్కు, హిరాలాల్, రవీందర్, సదర్‌లాల్, నాగ, చత్రు, మంగీలాల్, నరేశ్, కోటి, గన్ను తదితరులు ఉన్నారు.

టీజీవోస్ నాయకులు..

ఖమ్మం సహకారనగర్: నూతనంగా ఎన్నికైన తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీవోస్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రిలు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వల్లోజి శ్రీనివాసరావు, రమేశ్, వాసిరెడ్డి శ్రీనివాసరావు, కనపర్తి వెంకటేశ్వర్లు, కృష్ణారావు, బాలాజీ, వెంకన్న, నవీన్‌బాబు, శ్రీనివాసరావు,సుధారాణి, లావణ్య, శంకర్, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రులకు టీపీటీఎఫ్ ఆహ్వానం..



మంత్రి పొంగులేటితో మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులను టీపీటీఎఫ్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి మాట్లాడుతూ.. ఫిబ్రవరిలో జరిగే రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలకు ముఖ్య అతిథులుగా హాజరుకావాలని ఆహ్వానించామన్నారు. అనంతరం పలు సమస్యలను విన్నవించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్, నాయకులు ముత్తయ్య, వెంకటేశ్వర్లు, ప్రసాద్, శ్యామ్‌సుందర్, ఆకుల నాగేశ్వరరావు, వెంగళరావు, మల్లయ్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులే..



సమావేశంలో మాట్లాడుతున్న కొమ్ము శ్రీను

తిరుమలాయపాలెం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడేది కమ్యునిస్టులేనని సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను అన్నారు. మంగళవారం తిరుమలాయపాలెంలో జరిగిన పార్టీ జనరల్ బాడీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని, మండల కేంద్రంలో 100 పడకల ఆస్పత్రిని ప్రారంభించాలని, పబ్లిక్ టాయిలెట్ ఏర్పాటు చేయాలని, మండల కేంద్రంలో ఎంపీడీఓ ఆఫీస్ ఖాళీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రేపటి నుంచి చేపట్టే ప్రజాపాలన కార్యక్రమంలో కొత్త పెన్షన్లు, ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు స్వామి శాఖ కార్యదర్శి నెర్సుల వెంకటేశ్, కొమ్ము వెంకన్న, కొమ్ము నాగేశ్వరరావు, ఉప్పలయ్య, బచ్చలకూరి రాములు, సోమపొంగు రాము, బొజ్జ ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షాన నిలిచేది ఎర్రజెండానే..



ఖమ్మంరూరల్: జెండాను ఆవిష్కరిస్తున్న సురేశ్

ఖమ్మంరూరల్/కూసుమంచి: అధికారం ఉన్నా లేకపోయినా.. పేదల పక్షాన పోరాడేది ఒక్క ఎర్రజెండానేనని సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేశ్, పార్టీ మండల కార్యదర్శి భూక్యా నర్సింహా అన్నారు. మంగళవారం ఖమ్మరూరల్ మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్, కూసుమంచి మండలం లాల్‌సింగ్‌తండాలో జరిగిన సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా పార్టీ జెండాను ఆవిష్కరించిన సందర్భంగా వారు మాట్లాడారు. ఈ వందేళ్ల పార్టీ సుదీర్ఘ ప్రయాణంలో అనేక కష్టనష్టాలు వచ్చినప్పటికీ ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేయడంలో ఎక్కడా వెనక్కి తగ్గలేదని తెలిపారు. రైతులు, కూలీలు, పేదలు, కార్మికులతో పాటు అన్ని వర్గాల సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.అధికారం కోసం అనేక జెండాలు పుట్టుకొచ్చి అధికారం కోల్పోయాక కనుమరుగవుతుంటాయని, కానీ పేదల ఆశాజ్యోతి ఎర్రజెండా మాత్రం అనునిత్యం ప్రజల్లో ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి జి.మల్లేశ్, సీపీఐ నాయకులు శేషగిరిరి, వెంపటి సురేందర్, జిల్లా లింగయ్య, శ్రీకాంత్,పిచ్చయ్య, శంకర్, ప్రసాద్,ప్రశాంత్, మిడకంటి చినవెంకటరెడ్డి, వెన్నం భాస్కర్, బియ్యాల రాజు, బి.ఉపేందర్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దత్త జయంతి వేడుకలు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: మార్గశిర పూర్ణిమ సందర్భంగా నగరంలోని గాంధీచౌక్ వరప్రదాత షిర్డీ సాయి మందిరం, త్రీటౌన్ రంగనాయకుల గుట్టపై ఉన్న శ్రీ కృష్ణసాయి ఆశ్రమంలో మంగళవారం దత్త జయంతి వేడుకలు జరిగాయి. 108 కలశాలతో దత్తాత్రేయ స్వామికి అభిషేకాలు నిర్వహించి, హోమం జరిపారు. ఈ సందర్భంగా మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం నిర్మాణ, నిర్వహణ కమిటీ చైర్మన్ లగడపాటి రామారావు, మందిర చైర్మన్ వేములపల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శి అర్వపల్లి నిరంజన్, కోశాధికారి కురువెళ్ల జగన్మోహన్‌రావు, భక్తమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.